www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 14 డిసెంబర్ 2024
5
చిత్తూరు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - రామకుప్పం: సమాజంలో బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని రామకుప్పం ఏఎస్ఐ రెడ్డి శేఖర్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసం పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ బాల్యవివాహాల అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. 18 సంవత్సరాల బాలికలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి? అవగాహన కల్పించారు. యోగా, వ్యాయామాలు విషయాలపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 నారాయణ, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఎస్ఐ రెడ్డి శేఖర్

తగ్గని వరద ఉధృతి

- నీట మునిగిన పంట పొలాలు
- పొంగిన కుశస్థలి
- స్తంభించిన రాకపోకలు

ప్రజాశక్తి -విజయపురం: మండలంలో వరద ఉధృతి శుక్రవారం కుడా తగ్గలేదు. మండలంలోని ఒరూరు వద్ద నాగలాపురం - తిరుత్తణి రోడ్డు వరద ఉధృతి పెరగడం తో మధ్యాహ్నం వరకు వాహన రాకపోకలు కష్టతరమయ్యాయి. మండలంలోని గొల్లకండ్రిగ వద్ద చెరువు మొరవ పారడంతో వర్షపు నీరు నిలిచి పోయి పంట పొలాలు నీట మునిగింది. రోడ్డు మరమ్మతులో భాగంగా మొరవ నీరు వెళ్లేందుకు ఉన్న పైపులైను పూడి పోవడంతో వర్షపునీరు నిలిచిపోయి పంచాయతీ బోరు నీట మునిగింది. ఆ నీటినే తాగాల్సి వస్తోందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇళ్ళత్తూరు వద్ద చెరువుకు వచ్చే వరవ కాలువను ఆక్రమించడంతో వరద నీరు రోడ్డుపై ఏరులై పారి వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కాలువలు ఆక్రమణకు గురి కావడంతో పంట పొలాలు నీట మునుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిండు కుండలా చెరువులు

...42 చెరువుల్లో 40 చెరువులు నిండు కుండలా మారింది.

కుశస్థలి ఉప్పొంగడంతో స్తంభించిన రాకపోకలు

ఉప్పొంగిన కుశస్థలి

వరుస వర్షాలకు కృష్ణాపురం డ్యాం నిండటంతో గురువారం రాత్రి గేట్లు తెరిచారు. దీంతో కుశస్థలి నది నీటితో ఉప్పొంగింది. యధావిధిగా నదినీరు కీళపట్టు మార్గం వైపు ఉన్న లోతట్టు వంతెన పై ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలను ఆపివేశారు. ఆ వైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. డ్యామ్ గేటు తీసిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఎదురవుతోందని వంతెనపై రోడ్డు ఛిద్రమవడంతో పాటు పలుమార్లు కొట్టుకుపోతోందని, హైలెవల్ వంతెన వస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనుకున్నామని అయితే మూడేళ్ల పాటు సాగిన పనులు ప్రస్తుతం ఆగిపోయిందని వంతెన పూర్తయితే తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్థులు వాపోయారు.

చినుకు పడితే చిత్తూరు చిత్తడే!

ప్రజాశక్తి -చిత్తూరు టౌన్: చిత్తూరులో చినుకు పడితే రోడ్లన్నీ చిత్తడిచిత్తడిగా మారుతున్నాయి. ఈ కారణంగా వాహన చోదకులు పాట్లు, పాదచారులు ఫీట్లు చేయాల్సి వస్తోంది. చిత్తూరు పరిసర ప్రాంతాలైన కట్టమంచి, చంగల్రాయమట్ట సాంబయ్య కండ్రిగ, కామేశ్వరి నగర్, బైపాస్ రోడ్డులు సక్రమంగా లేకపోవడంతో రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. రోడ్లు బురదమయంగా తయారవుతున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయలేక వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. పాదచారుల పరిస్థితి మరి దయనీయంగా మారింది. స్కూల్, కాలేజీ, బస్సులు ఎక్కడ బోల్తా పడుతాయోనని వాహనదారులు హడలిపోతున్నారు. ద్విచక్ర వాహన దారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళలో ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు

తగిన చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికకు సర్వం సిద్ధం

- అన్ని ఏర్పాట్లు పూర్తి
- నేడే నామినేషన్లు, కౌంటింగ్

ప్రజాశక్తి -పుంగనూరు: సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు అన్ని సర్వం సిద్ధం చేశారు. నామినేషన్ల స్వీకర ణ శనివారం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభ మవుతుంది. 9.45 గంటల నుండి 10.15 గంటల నామినేషన్లు స్వీకరణ, కౌంటింగ్ పూర్తవుతుంది.పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలలో వంద ఎకరాలకు పైగా ఆయకట్టు చెరువులు 45 ఉన్నాయి. వాటి పరిధిలో 9,845 మంది ఓటర్లు ఉన్నారు. పుంగనూరు మండలం లో13 సాగునీటి చెరువుల సంఘాలు ఉన్నాయి. చెరువులు ఉన్న ఆయా గ్రామాల పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నిక లు నిర్వహిస్తారు. మొత్తం ఓటర్లు 2,691 మందికి పురుషు లు 2,066, స్త్రీలు 624 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి సాగునీటి సంఘానికి ఆరుగురు సభ్యులను ఎన్నుకుం టారు. వీరిలో ఒకరు అధ్యక్షులు, మరొకరు ఉపాధ్యక్షులుగా కొనసాగు తారు. నవంబర్ 13 వతేదీ ఓటర్ల జాబితా విడుదల చేసి అదే నెల 20వ తేదీ నోటిఫికేషన్ విడుదలకు అధికారు లు కసరత్తు చేసి పూర్తి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండుసార్లు ఎన్నికలు నిర్వహించగా రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు హయాంలో ఒకసారి నిర్వహిం చారు. అనంత రం వచ్చిన వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలను రద్దు చేయడంతో రైతులు పలు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో నాలుగో సారి ఈ ఎన్నిక లు చేపట్టారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడే నామినేషన్లు, కౌంటింగ్

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నేటితో మొదలవుతోంది. అధికారులు ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించారు. వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం కారణంగా జాబితాలను మొత్తం సవరించుకుని కొత్తగా తయారు చేసుకోవాల్సి వచ్చింది. నీటి సంఘాల ఎన్నికలకు నవంబరు 20న నోటిఫికేషన్ వెలువడింది. ముందు ఓటర్ల జాబితా సవరణలు, తుది ఓటర్ల జాబితా ప్రచురణ నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు 29 రోజుల షెడ్యూల్‌ను జలవనరుల శాఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేసింది. జలవనరుల శాఖకు అనుబంధంగా ఉండే సాగునీటి వ్యవస్థను ముక్కలు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో 1997లో అప్పటి సీఎం చంద్రబాబు వివిధ రాష్ట్రాల్లోని సాగునీటి వ్యవస్థలపై అధ్యయనం చేయించి ఒక చట్టాన్ని తెచ్చారు. రాష్ట్రంలో రైతుల నీటిపారుదల వ్యవస్థల యాజమాన్య చట్టాన్ని రూపొందించారు. అదే ఏడాది మొదటి సారి ఎన్నికలు నిర్వహించారు. తర్వాత 2008లో సీఎంగా ఉన్న వైఎస్ఆర్ చట్టానికి కొన్ని సవరణలు చేసి ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర విభజన తర్వాత 2015లో ఈ ఎన్నికలు జరిగాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ నీటి సంఘాలకు 6 నెలల పదవీకాలం ఉండగానే 2020లో రద్దు చేసింది. తర్వాత సాగునీటి సంఘాల ఊసు ఎత్తలేదు. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి జల వనరుల శాఖ ప్రత్యేక అధికారులను నియమించి ఎన్నికల పనులు పూర్తి చేసింది. పొలం సాగులో ఉండి, సర్వే నెంబర్, పాస్ పుస్తకం ఉంటే ఆ రైతును ఓటరుగా పరిగణి స్తారు. ఈ పరిణామంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

విజయపురం: విజయపురం మండలంలోని 12 చెరువులకు సాగునీటి సంఘ ఎన్నికలు నిర్వహిస్తున్నా మని ఇరిగేషన్ ఏఈఈ ప్రశాంత్ తెలిపారు. మండలం లోని పన్నూరు, మాధవరం, ఆలపాకం పెద్ద చెరువు, ఆలపాక - కండ్రిగ, బూచివానత్తం, ఆమగుంట, కేవీపురం, మంగళం, గురుస్వామి చెరువు, విజయ పురం, కోసలనగరం, కళియంబాకం చెరువులకు సాగునీటి సంఘ ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కోసలనగరం సాగునీటి సంఘ ఎన్నికలు సచివా లయంలోనూ, మిగిలిన 11 సాగునీటి సంఘ ఎన్నికలు సంబంధిత పాఠశాలల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలో12 చెరువులకు కలిపి ఓటర్లు 1205 (పురుషులు), 482(మహిళలు) మొత్తం 1687 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు మొత్తం పోలింగ్ సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించామని తెలిపారు.

వెదురుకుప్పం: జిడి నెల్లూరు నియోజకవర్గం పరిధిలోని వెదురుకుప్పం మండలంలోని మొత్తం నాలుగు సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహశీల్దారు నాలుగు చెరువుల పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 575 వున్నారు. మాంబేడు(కొత్త చెరువు) అండ్ టీకేఎం పురం (చెంజి వెంకటరెడ్డి చెరువు)-172, వేణుగోపాలపురం (దశ బంధన చెరువు)-145, బుచ్చిరెడ్డి కండ్రిగ చెరువు పరిధిలో 258 చొప్పున

ఓటర్లు ఉన్నారు.

యాదమరి: మండలంలోని మూడు సాగు నీటి పారుదల సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దారు పార్థసారథి తెలిపారు. మండలంలో మాది రెడ్డి పల్లి లోని గూటాల వంక చెరువు, కుక్కలపల్లి పరిధిలోని బోధన్ చెరువు, భూమిరెడ్డిపల్లి గ్రామం లోని నుంజర్ల ప్రాజెక్టు సంబంధించి సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయి.

సదుం : మండల పరిధిలోని పాలమంద రెడ్డి చెరువు, తిమ్మా నాయన పల్లి పరిధిలోని చిక్కరాయ చెరువు, వ్యాసప్ప చెరువు, చెరుకు వారి పల్లి పరిధిలోని అయ్యవారి చెరువు,సదుం గ్రామపంచాయతీ పరిధి లోని సీత చెరువు, తాటిగుంటపాలెం పరిధిలోని పింఛా అనికట్ సిస్టం చెరువుకు సదుం తహశీల్దార్ మారు హుస్సేన్ ఆధ్వర్యంలో శనివారం నీటి సంఘాలు ఎన్నికలు జరగనున్నాయని ఎన్నికల అధికారి గోపి శుక్రవారం విలేకరులకు తెలిపారు. మండల పరిధిలోని ఐదు చెరువులకు 1,604 ఓటర్లు ఉన్నారని తెలిపారు.

ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలంలోని ఆరు సాగు నీటి పారుదల సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దారు లోకనాథ పిళ్లై తెలిపారు. మండలంలో మొత్తం ఆరు సంఘాలకు ఎన్నికలు శనివారం జరుగనున్నాయి. ఆరు చెరువుల పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 1980. పుల్లూరు పెద్ద చెరువుకు 273 మంది, ఎన్ ఆర్ పురం చెరువుకు 273 ,రాజు పెరుమాల చెరువు 273, దేవలమ్మ చెరువు పరిధిలో 474, ఆరిమాకుల కోన చెరువు పరిధిలో 308, మూలూరు చెరువు పరిధిలో 314 మంది ఓటర్లు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న డిఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతిదేవి

అర్బన్ ఆరోగ్య కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఒ ప్రభావతిదేవి చిత్తూరు నగర పరిధిలోని ప్రశాంత్ నగర్, టెలిఫోన్ కాలనీ అర్బన్ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతాశిశు సంరక్ష ణ, గర్భిణులకు , బాలింతలు, పిల్లలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తహీనత లేకుండా చూడటం, వ్యాధి నిరోధక టీకాలు పూర్తి చేయటం, జెఎస్‌వై, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం అమలు, క్యాన్సర్ స్క్రీనింగ్‌పై, ఆర్‌బిఎస్‌కే స్క్రీనింగ్, సీజనల్ వ్యాధులు, తదితర కార్యక్రమాలపై క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డాక్టర్ వందన, సిబ్బంది పాల్గొన్నారు.

సోమల ఇన్‌ఛార్జి ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సోమల ఇన్‌ఛార్జి ఎంఈవోగా కేశవరెడ్డి

ప్రజాశక్తి-సోమల: సోమల మండల విద్యాశాఖ అధికారిగా కేశవరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చౌడేపల్లి మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూ సోమల ఇన్‌ఛార్జి మండల విద్యాశాఖ అధికారి బాధ్యతలు చేపట్టారు. నూతన విద్యాశాఖ అధికారిణి ఎంఈఓ 2 శివరత్నమ్మ మండల విద్యాశాఖ కార్యాలయాల సిబ్బంది, సిఆర్పిలు ఘన స్వాగతం పలికారు. మండలంలో పాఠశాలల పర్యవేక్షణ చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

అన్నదాతలను ఆదుకోవాలి

- ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళన
- కలెక్టరేట్ ఎదుట వైసిపి నిరసన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : కూటమి సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని నిరసిస్తూ వైసిపి నాయకులు చిత్తూరులో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలపై టిడిపి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగడుతూ గిరింపేట దుర్గమ్మ గుడి వద్ద నుండి కలెక్టరేట్ వరకు పాదయాత్రగా వెళ్లి జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరికి అన్నదాతలు ఎదు ర్కొంటున్న సమస్యలను ఏకరువు పెడుతూ విజ్ఞాపన పత్రం అందించారు. వైసిపి చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ రెడ్డెప్ప , కుప్పం నుండి ఎమ్మెల్సీ భరత్ , పలమనేరు నుండి వెంకటేగౌడ, పూతలపట్టు సునీల్ , గంగాధరనెల్లూరు కృపాలక్ష్మి, వైసీపీ సీనియర్ నాయకులు, రైతు, మహిళా, యువజన విభాగాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయ కులు , చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కింద కేంద్ర సాయం కాకుండా అన్నదాత సుఖీభవ పేరుతో అదనంగా 20 వేల రూపాయల ఇస్తామన్న చంద్రబాబు ఎన్నికల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో రైతులకు అందిస్తున్న ఎంఎస్పీ, రైతు పంట బీమాను ఎత్తివేయటం కూటమి సర్కార్‌కు రైతులపై ఉన్న చిన్న చూపుకు తార్కాణమన్నారు. తుపానుతో నష్టపోయిన రైతులను

ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ఆదుకోవాలని, పంట ధరల స్థిరీకరణ చర్యలు చేపట్టి రైతుల వద్ద తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు .

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

మీడియా స్వేచ్ఛను హరించడం అన్యాయం

- కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : మీడియా స్వేచ్ఛ ను హరించడం అన్యా యం అంటూ కలెక్టరే ట్ ఎదుట జర్నలిస్టులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా వేముల వద్ద సాగునీటి సంఘం ఎన్నికలను కవర్ చేయడానికి వెళ్లిన సాక్షి మీడియా ప్రతినిధులపై అక్కడి టిడిపి నాయకులు దాడులకు పాల్పడి గాయపరచడం బాధాకరమన్నారు. విధుల నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడానికి ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇది పత్రికా స్వేచ్ఛ భావ ప్రకటనపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నట్లు ఆరోపించారు. ఇలాంటి దాడులను ప్రోత్సహించకూడదని చెప్పారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడ్డ వ్యక్తులపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వం పోలీసు యంత్రాంగం తీసుకోవాలన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రమేష్ బాబు, అశోక్ కుమార్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు శివప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు గజపతి, శివ కుమార్, మహేష్, వీర రాఘవులు నాయుడు, చంద్ర, రాజేష్ కుమార్, హరీష్, తేజ, అయ్యప్ప నాయుడు, జయకుమార్, శివ, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తీర్ణత, నాణ్యతా ప్రమాణాలు పెంపు

యుటిఎఫ్ టెన్త్ మోడల్ పేపర్ల ఆవిష్కరణలో ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన ఎస్ఎస్‌సి -2025 మోడల్ టెస్ట్ పేపర్స్‌ను జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరి జిల్లా విద్యా శాఖ అధికారి బి వరలక్ష్మి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులు రూపొందించిన ఏడు పేపర్స్ పాట్రన్ అండ్ ఎగ్జామ్ ఓరియెంటెడ్ లో రూపొందించిన అన్నీ సబ్జెక్టు నాలుగు మోడల్ పేపర్స్ ఆన్సర్స్‌తో రూపొందించారని, మార్చి 17 నుంచి నిర్వహించే కామన్ పరీక్షలు దృష్ట్యా అన్ని స్థాయిల విద్యార్థులకు ఉపయోగపడే మోడల్ టెస్ట్ పేపర్స్ తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో తయారు చేశారని పేర్కొన్నారు. ఈ మోడల్ పేపర్లు చదవడం ద్వారా విద్యార్థుల ఉత్తీర్ణతకు, వారిలో నాణ్యత ప్రమాణాలు పెంచడానికి ఉపయోగపడతాయని, వీటిని జిల్లా ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయడానికి కృషి చేయడం అభినందనీయమని వారు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్

యుటిఎఫ్ టెన్తు మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరి

రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సోమశేఖర్ నాయుడు ,ఎన్. మణి గండన్, సహాధ్యక్షులు కే రెడ్డప్ప నాయుడు, ఎస్ రెహనా బేగం, నాయకులు ఎస్పీ బాషా, డి ఏకాంబరం , కె సరిత ,ఎం పార్థసారథి, పిసి బాబు, సి వెంకటేశ్వర రెడ్డి, వంశీకృష్ణ, నాగరాజా, రమేష్ పాల్గొన్నారు.

భూ సమస్యల వెల్లువ

రెవెన్యూ సదస్సులో 49 వినతులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని చప్పిడి పల్లి గ్రామంలో తహశీల్దారు మాధవ రాజు అధ్యక్షతన శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు భూ సమస్యలు వెల్లువలా అందాయి. ఈ సదస్సుకు హాజరైన ప్రజలకు తహశీల్దారు మాధవరాజు రెవెన్యూ సదస్సు పై ప్రజలకు వివరించారు. అనంతరం భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 49 వినతులు అందించినట్లు స్థానిక విఆర్ఓ జయరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఆర్ఐ సరిత, గ్రామ రెవెన్యూ అధికారి జయరాం, వీఆర్ఏలు తిప్పన్న, పద్మావతి, స్థానిక టిడిపి నాయకులు సురేష్, మునెప్ప, చంద్ర, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం..ఓజుకుప్పం!

- సిసి రోడ్డుపైనే వర్షపు నీరు
- వెలగని వీధి లైట్లు
- కానరాని పారిశుధ్యం

ప్రజాశక్తి- విజయపురం, నగరి: అభివృద్ధికి ఆమడ దూరంలో వుంది.. నగరి రూరల్ పరిదిలోని ఓజు కుప్పం..ఈ పంచాయతీలో సుమారు 200 కుటుంబాలు ఉన్నాయి, అయినా కనీస మౌలిక వసతులు కరువై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో స్థానిక ప్రజలు అభివృద్ధికి దూరంగా అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు.

సిసి రోడ్డుపైనే వర్షపు నీరు

వర్షం పడిన ప్రతిసారి సిమెంటు రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. దీనికి తోడు వీధికి ఇరువైపులా మురుగు కాలువ లేకపోవడంతో స్థానికులు వాడే నిత్యం వాడే నీటిని వీధులపై వదిలేయడంతో రాకపోకలకు అవరోధంగా మారుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. సిమెంట్ రోడ్డు వేసిన అధికారులు కాలువ నిర్మించకపోవడం ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వెలగని వీధి లైట్లు

గ్రామంలో వీధి లైట్లు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీ చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా ఉండడంతో అసలే

సిసి రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

అటవీ ప్రాంతం కావడంతో విష సర్పాల సంచారం అధికంగా వుంది. దీనికి భయపడే సాయంత్రం 6 గంటలు దాటితే బయటకు రావడానికి స్థానిక ప్రజలు భయపడుతున్నారు. చేతిలో టార్చ్ లైట్ లేదా సెల్ లైట్ ఉంటే తప్ప బయట అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సర్పంచ్‌కు, కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మూడు నెలలుగా చీకటిలో మగ్గుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్యం అధ్వానం

గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా వుంది. ఎక్కడబడితే అక్కడ చెత్త చెదారం దర్శనమిస్తోంది. మురికి కాలువలు కరువయ్యాయి. చెత్త దిబ్బలు గుట్టలుగుట్టలుగా దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణ పూర్తిగా లోపించి దోమలు ఎక్కువగా వృద్ధి చెంది రాత్రి పూట కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమ కాటు వల్ల

పేరుకుపోయిన చెత్తకుప్పలు

చాలామంది తీవ్ర జ్వరం, దగ్గుతో ఆస్పత్రి పాలవుతున్నారని వాపోయారు. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని స్థానికులు కోరుతున్నారు.

పేద మహిళకు సాయం

పేద మహిళకు సాయం అందిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఎవరూ లేక దుర్భర స్థితిలో వున్న మహిళను టిడిపి నాయకులు శుక్రవారం సాయం అందించారు. మండలంలోని ఆర్‌కేవిబి పేట గ్రామ పంచాయతీ హరిజన వాడలో మాజీ సర్పంచ్ భార్య పాంచాలమ్మను చూసుకునే వారు లేక ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఇటీవల రెండు రోజులుగా భారీ వర్షాలతో ఆమె వుంటున్న పూరి గుడిసె కూలే పరిస్థితిలో ఉండడంతో ఆమెను స్థానిక అంగనవాడీ కేంద్రానికి తరలించారు. కార్వేటినగరం మండల యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి ఢిల్లీ బాబు రెడ్డి, మండల ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి, దళిత నాయకుడు చంగలరాయిలు , ఆర్ కె వి బి పేట క్రియాశీల నాయకుడు నాగభూషణం రెడ్డి, ముని పరామర్శించి ఆమెకు దుస్తులు, పండ్లు, స్నాక్స్, భోజనం అందించారు. ఆమెను ఆదుకునే విషయం ఎమ్మెల్యే థామస్ దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు.

18న ఉపకరణాలకు దరఖాస్తులు: ఎంపిడివో

ఎంపిడివో హరిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: భారత ప్రభుత్వ సంస్థ అలింకో, ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమ సంస్థ (చిత్తూరు) ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఉపకరణాల నమోదు గుర్తింపు శిబిరం ఈనెల 18న ఎస్ఆర్ పురం మండలం జెడ్పీ హైస్కూలులో నిర్వహించనున్నట్లు గంగాధర నెల్లూరు ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ శిబిరానికి జీడీ నెల్లూరు మండలంలోని విభిన్న ప్రతిభావంతులు 2 సెట్లు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని అందులో విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల దరఖాస్తుకు వికలత్వ ఫొటోలు, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యుడిఐడి కార్డు, రసీదు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం తీసుకుని సమీపంలోని శిబిరాలకు హాజరై నమోదు చేసుకోవాలని కోరారు.

ఎంపీ నివాళి

త్యాగధనులకు నివాళులర్పిస్తున్న చిత్తూరు ఎంపీ ప్రసాదరావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పార్లమెంటుపై జరిగిన ఉగ్రవాద దాడికి ఎదురొడ్డి నిలిచి తమ ప్రాణాలను అర్పించి, అసువులు బాసిన భద్రతా సిబ్బందికి ఢిల్లీ పార్లమెంటు ప్రాంగణంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు. శుక్రవారం ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగాన్ని స్మరించుకుని త్యాగధనుల స్ఫూర్తితో ముందుకు సాగుతామని నినదించారు. వారి అత్యున్నత త్యాగానికి దేశం ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటుందని పేర్కొన్నారు. ఉగ్ర దాడిలో జాతి గర్వాన్ని కాపాడేందుకు తమ ప్రాణాలను త్యాగం చేసిన వీరుల ధైర్యానికి, పరాక్రమానికి వందనం చేస్తున్నానని తెలిపారు. దేశానికి వారి సేవ , త్యాగం ప్రతి పౌరుడికి స్ఫూర్తినిస్తుందని తెలిపారు.

రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి: తహశీల్దారు

ప్రజాశక్తి -విజయపురం: రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు కిరణ్ పేర్కొన్నారు. మండలంలోని కాళికాపురంలో రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ కిరణ్ ఈ సందర్భంగా సూచించారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: సోమల మండలం నంజంపేట సచివాలయంలో తహశీల్దార్ బెన్ను రాజ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ పరిధిలోని 400 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని అటవీ శాఖ వారు రెవెన్యూ శాఖ వారు జాయింట్ సర్వే చేసి పేదలకు పంచాలని తద్వారా భూమి లేని నిరుపేదలకు ఆసరా భరోసా కల్పించినట్లు అవుతుందని అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అష్రఫ్ ఆలి, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో

బంగారుపాళ్యం: ప్రతి అర్జీదారులకి న్యాయం చేస్తామని తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండ్లకట్ట మంచి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో పలువురికి దారి సమస్య వుందని విన్నవించారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి ఒక్కరికి తగు న్యాయం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రారు యుగంధర్, ఆర్ఐ మధుసూదన్, మండల సర్వేయర్ లావణ్య, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

వేషాలతో అలరిస్తున్న విశ్రాంతి ఉద్యోగులు

ఘనంగా బంగారమ్మ జాతర

ప్రజాశక్తి కార్వేటినగరం: సంస్థానాదీశుల కాలం నుంచి కార్తీక మాసంలో నిర్వహించే కార్వేటినగరం జాతరను పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారి బంగారు విగ్రహాన్ని గ్రామ వీధుల్లో శుక్రవారం వైభవంగా ఊరేగించారు. సంస్థానాదీశుల ఆనవాయితీ ప్రకారం అమ్మవారి విగ్రహాన్ని భజన మందిరం నుంచి ఆస్థానాదీశుల ఇంటికి వద్ద ఊరేగింపుగా ప్రత్యేక వాయిద్యాల నడుమ తీసుకొచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు. మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు తోటి వేషాలతో గ్రామ వీధిలో ఊరేగుతూ చూపరులను ఎంతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాధమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, మధు, యువత పలువురు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి గ్రామం మొగిలీశ్వర స్వామికి అనుసంధానమైన దేవరకొండలో శుక్రవారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జలకంఠేశ్వర స్వామిని కార్తీక దీపారాధాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపార ధర్మకర్త విజయ్‌కుమార్, ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజులు, అర్చకులు పాల్గొన్నారు.

చిత్తూరు టౌన్: చిత్తూరులోని శివాలయాలు, అమ్మవారి దేవాలయాలు, సప్త కన్యకులమ్మ గుడులలో కార్తీకదీపం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాలను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

రేపు సమావేశాన్ని జయప్రదం చేయండి: వైసిపి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఐరాల క్రాస్ నారాయణాద్రి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్న వైసిపి సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని పూతలపట్టు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సునీల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఐరాల క్రాస్ నారాయణాద్రి కళ్యాణమండపంలో నియోజకవర్గ వైసిపి సర్వసభ సమావేశం నిర్వహిస్తామని ఈ సమావేశానికి రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి పాల్గొంటారని ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా కుప్పం: కమిషనర్

మాట్లాడుతున్న కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. 'మీరు చెత్తను వాహనాలకు అందించండి ..అభివృద్ధి మేము చేస్తాం..' అంటూ కమిషనర్ పేర్కొన్నారు. శుక్రవారం పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పట్టణ అభివృద్ధికి పని చేయాల్సిన పురపాలక సంఘం అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి కాస్త సమయం పడుతుందన్నారు. ముందు పురపాలక సంఘం తరపున చేపట్టవలసిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇందులో భాగంగా పట్టణంలో పారిశుధ్య పనులను పూర్తిస్థాయిలో నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే కాలువల పూడికతీత పనులను సగానికి వరకు పూర్తి చేశామన్నారు. పట్టణంలో పచ్చదనాన్ని పెంచుతూ ముఖ్యమైన కూడళ్లలో మొక్కలు నాటామన్నారు. పట్టణంలోని రోడ్లకు ఇరువైపులా ప్రజలకు నీడను ఇచ్చేలా చెట్లను పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. వీటి కోసం ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ముఖ్యంగా ప్రతి ఇంటిలో చెత్తకుండీలను ఏర్పాటు చేసి, చెత్తను పాలక సంఘం చెత్త వాహనాలకు మాత్రమే అందించాలని, రోడ్లపై పడవేయరాదని సూచించారు. పట్టణ పరిధిలో పశువుల యజమానులు పశువులను రోడ్లపై విడిచిపెట్టడం మానుకోవాలని సూచించారు. రోడ్లపై పశువులను విడవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడడంతో పాటు పురపాలక సంఘం ఏర్పాటు చేస్తున్న మొక్కలను పశువులు నాశనం చేస్తున్నాయని, వీటివల్ల పట్టణంలో పచ్చదనం దెబ్బతింటుందన్నారు. వీటన్నింటినీ గుర్తించి పశువులను వాటి యజమానులు రోడ్లపై విడవకుండా జాగ్రత్త పడాలన్నారు. పురపాలక సంఘం సూచనలను అధిగమించిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పురపాలక సంఘం కౌన్సిలర్లు సోము, సురేష్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, స్థానిక నాయకులు ఎంఆర్ సురేష్ పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శిక్షణ

బైరెడ్డిపల్లి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ మండల వెలుగు కార్యాలయంలో కిశోరి వికాస్ కార్యక్రమంలో భాగంగా బైరెడ్డిపల్లి మండల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ అరుణశ్రీ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్ మహిళా పోలీస్, ఏఎన్ఎం అంగన్‌వాడీ వర్కర్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. గ్రామ స్థాయి 11 - 18 సంవత్సరాలు లోపు బాలికలకు ఎదిగే వయసులో, విద్య, వైద్యం ఆరోగ్యం, పోషణ, బాల్య వివాహాల నిర్మూలన, రక్త హీనత నివారణ, డ్రాప్ ఔట్స్‌ను తగ్గించడం, రుతుచక్ర పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు వివిధ శిక్షణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, బాలాజీ, ఈవోపీఆర్డి ప్రసాద్, వైద్య అధికారి అరుణకుమార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: మండలం కేంద్రమైన ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశ మందిరంలో శుక్రవారం కిశోరి వికాసం పై ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. కిశోర బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని చట్టాలపై అవగాహన ఉండాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలని, రక్తహీనత బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెంట్ తదితర అంశాలపై అన్ని శాఖల వారు అవగాహన కలిగి ఉండాలని శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ ,ఎస్ఐ శివశంకర్, ఎంఈఓ కేశవరెడ్డి, మెడికల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ రెడ్డి, సిడిపిఓ రాజేశ్వరి, ఐసిడిఎస్ సూపరువైజర్ హరిత , జూనియర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. చిత్తూరు ఐసిడిఎస్ కార్యాలయం నుండి మురళి, కిశోర్ రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. అనంతరం సమావేశానికి హాజరైన అందరి వద్ద వ్యాయామాలు చేయించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - సదుం : మండల పరిధిలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లలో శనివారం మెయింటెనెన్స్ కార్యక్రమాలలో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్తులో అంతరాయం ఉంటుందని ఎస్పీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. విద్యుత్తులో అంతరాయానికి ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

పోలీస్ స్టేషన్‌కు టీవీ వితరణ

పోలీసులకు సిసి టీవీని అందిస్తున్న టిడిపి నాయకుడు బసవరాజు

ప్రజాశక్తి -శాంతిపురం: రాళ్లబూదుగూరు చెందిన టిడిపి నాయకుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బసవరాజు 70 వేల రూపాయల విలువచేసే సోనీ బ్రావియా టీవీని రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాల వీక్షణ కోసం ఎస్ఐ నరేష్ కు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ డైరెక్టర్ బసవరాజు మాట్లాడుతూ తన అబ్బాయి కిరణ్ జ్ఞాపకార్థం టీవీని అందించామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ బసవరాజు ను అభినందిస్తూ, వీరు అందించిన టీవీ ద్వారా మండలంలోని కెమెరాలను దీనికి అనుసంధానం చేసి పర్యవేక్షిస్తామని తద్వారా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడడానికి దోహదపడుతుందని తెలిపారు. ఇంకా మండలంలో అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు ప్రయత్నిస్తున్నామని సాధ్యమైనంత త్వరలో అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలు అమరుస్తామని దాతలు ఎవరైనా ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా సహాయ పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పరమేష్, కళ్యాణ్, బేటప్ప, టిడిపి నాయకుడు పీఎం రాము, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలు అభివృద్ధి చెందాలి: ఏపీఎం

మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాస్‌మూర్తి

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలో స్వయం సహాయక సంఘం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం శ్రీనివాస్ మూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మండల విఓ లీడర్లతో సమావేశం అయ్యారు. వివో లీడర్లు పొదుపు సంఘాల మహిళలకు పారదర్శకంగా రుణాలు అందించి ఆర్థిక అభివృద్ధి చెందేలా చిల్లర దుకాణాలు ఏర్పాటు, చేతివృత్తుల పనులు, చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని స్వయం కృషితో అభివృద్ధి చెందుతూ.. సకాలంలో నగదు జమ చేసే విధంగా కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం విరివిగా రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని స్వయం సహకార మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు, వివో లీడర్లు, సంఘ లీడర్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం: టిడిపి

బైక్ ర్యాలీలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని టిడిపి నేతలు పేర్కొన్నారు. శుక్రవారం చిత్తూరు టిడిపి జిల్లా కార్యాలయం నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు టిడిపి నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు మాసాలు రైతు అందించిన డ్రిప్ ఇరిగేషన్లు , పాడి రైతులకు మినీ గోకులాలు రైతులకి సబ్సిడీలో పనిముట్లు , నీటి సంఘాల సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు దొరబాబు, బాలాజీ, కటారి హేమలత తెలిపారు. గత ఐదేళ్లలో ప్రజా, రైతు సంక్షేమాన్ని విస్మరించిన జగన్ ప్రభుత్వం నేడు రైతు సంక్షేమ అంటూ ఆందోళన కార్యక్రమాలకు పూనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని పిఈ ఎస్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ తరుపున నేడు శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు క్లబ్ అడ్వైజర్ డాక్టర్ మహేష్ తెలిపారు. కుప్పంలో లయన్స్ క్లబ్ ఆరంభం అయిన నాటి నుండి క్లబ్ సభ్యులు అనేక సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో ముఖ్యంగా ప్రతినెలా రెండవ శనివారం నాడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నాడు నిర్వహించబోవు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ సభ్యులు కోరారు.

నేడు రోడ్డు మరమ్మతు ప్రారంభం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి -యాదమరి: చిత్తూరు –గుడియాత్తం అంతర్‌రాష్ట్ర రహదారి మరమ్మతులకు శనివారం భూమి పూజ చేపట్టనున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యదమరి – గుడియాత్తం రోడ్డుకు శనివారం ఉదయం 10గంటలకు భూమి పూజ లో పాల్గొననున్నారు. యాదమరి మండలం కాశిరాళ్ల వద్ద భూమి పూజకు ముఖ్య అతిథులుగా చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ హాజరు కానున్నారు. పూతలపట్టు నియోజక వర్గానికి సంబంధం చిన టిడిపి, బిజేపి, జనసేన నాయకులు, పెద్దలు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

క్రైం న్యూస్

లారీ ఢీకొని వృద్ధుడు మృతి

రఘు నాథయ్య (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-పూతలపట్టు: లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలం లో శుక్రవారం చోటుచేసుకుంది. తిమ్మిరెడ్డి పల్లికి చెందిన రఘు నాథయ్య (70) శుక్రవారం ఉదయం పాడి పశువుల ఆవరణ నుంచి పాలు సేకరించి పూతలపట్టు– కర్నూలు జాతీయ రహదారి తిమ్మిరెడ్డి పల్లి గ్రామం వద్ద రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న సమయంలో వెనుక నుండి లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని నేషనల్ హైవే వాహనం సాయంతో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పూతలపట్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : మండలంలో శుక్రవారం చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. పలమనేరు– కుప్పం జాతీయ రహదారిలోని ఆంజనేయ స్వామి గుడి మలుపు వద్ద ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో బైరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివ (39) ఎడమ కాలు ఫ్యాక్చర్ అయింది. కైగల్ జలపాతం వద్ద కూలికి వెళ్లి తిరిగి బైరెడ్డిపల్లికి వస్తున్న సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. . వికోట మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన విజయ్ కుమార్ (40) వికోట నుండి కొలమాసనపల్లిలో వారి భార్యకు చెందిన బంధువుల ఇంటికి వెళుతున్న తరుణంలో ఆంజనేయ స్వామి గుడి మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయాలు తగిలినట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తెలిపారు. వీరిని మెరుగైన చికిత్స కోసం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలాలకు చేరుకొని పరిశీలించారని స్థానికులు తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుటే కత్తితో దాడి

ప్రజాశక్తి -సోమల: కుటుంబ కలహాలతో బావ, బావమరిదిపై కత్తితో దాడి చేసిన సంఘటన సోమల పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. సోమల దళితవాడకు చెందిన మునస్వామి నంజంపేట దళితవాడకు చెందిన రామకృష్ణ అక్కను పెళ్లి చేసుకున్నాడు. మునుస్వామి కుమారుడు సుభకర్‌కు రామకృష్ణ కుమార్తె హిమబిందును ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఆరు నెలలుగా మనస్పర్థలు ఏర్పడి విడివిడిగా ఉన్నారు. పిల్లలను విడదీయడంలో రామకృష్ణ పాత్ర ఎక్కువగా వుందని మునుస్వామి పెద్దమనుషుల సమక్షంలో ఆరోపిస్తుండే వారు. సోమవారం చిత్తూరులో పోలీసులు హిమబిందు తన సమస్యపై ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం పోలీస్ స్టేషన్లో ఇరువురినీ పిలిపించి మాట్లాడున్న సమయంలో కోపోద్రిక్తుడైన మునస్వామి ముచ్చు కత్తితో రామకృష్ణ మెడపై నరికాడు. ఈ సంఘటనపై అటు పోలీసులు, ఇటు బస్టాండ్ లో ఉన్న ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. తేరుకున్న పోలీసులు మునస్వామిని అదుపులో తీసుకొని రామకృష్ణను 108 సాయంతో మొదట సోమలకు ఆపై పీలేరుకు తర్వాత మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నగదు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేసి 14 మందిని అరెస్టు చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక సీఐ శ్రీనివాసంతి కథనం మేరకు గంగాధరనెల్లూరు మండలం కొత్త వెంకటాపురం పంచాయతీలోని అల్లయ్య ఇటుకల బట్టి వద్ద పేకాట ఆడుతుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది పేకాట స్థావరంపై మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో 14 మందిని అరెస్టు చేసి , రూ.10,370 నగదుతో పాటు తొమ్మిది ద్విచక్ర వాహనాలు, 9 మొబైల్ ఫోన్లను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న 14 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది గోపాల్ బాబు, శరత్, కిషోర్ పాల్గొన్నారు.

పాడి ఆవును ఢీకొన్న కారు

ప్రజాశక్తి -యాదమరి: పాడి ఆవును కారు ఢీకొన్న సంఘటన చెన్నై –బెంగళూరు జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆవు రెండు కాళ్లు విరిగిపోయాయి. కొత్తపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా అదే గ్రామానికి చెందిన పాడి ఆవును చిత్తూరు నుండి బెంగళూరుకు వెళుతున్న కారు వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. మూగ జీవం రోడ్డుపై పడి విలవిలాడుతున్నా అది చూసి కారు ఆపకుండా డ్రైవరు నిలపకుండా వెళ్లిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు కారును ఆపే ప్రయత్నం చేసినా కారు నిలపలేదు. రోడ్డుపైనే ఆవు తీవ్ర గాయాల పాలై విలవిలలాడింది. స్థానికుల సాయంతో రోడ్డులో ఉన్న ఆవును ఆస్పత్రికి తరలించారు. మూగజీవాలను కారుతో ఢీకొని వెళ్లిపోయిన వాహన దారునిపై పోలీసులు కేసు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఏఎస్ఎం క్లాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న సహాయ కమిషనర్ ప్రసాద్

ఏఎస్ఎం కాంప్లెక్స్ పరిశీలన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నగరంలోని కొంగారెడ్డిపల్లి వద్దనున్న ఏఎస్ఎం మున్సిపల్ కాంప్లెక్స్‌ను సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. కాంప్లెక్స్‌లో దుకాణాలను పరిశీలించి, అద్దె బకాయిలపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఏ దుకాణానికి సంబంధించి ఎంత బకాయిలు ఉన్నాయి? దీర్ఘకాలికంగా బకాయిలు ఉన్న దుకాణాలు ఏవి? వాటికి సంబంధించిన నోటీసులు ఇచ్చారా? అని ఆరా తీశారు. మున్సిపల్ దుకాణాలను అద్దెకు తీసుకున్న దుకాణదారులు అద్దెలను సకాలంలో, సక్రమంగా చెల్లించాలని ఆదేశించారు. దీర్ఘకాలికంగా బకాయిలు ఉన్న దుకాణదారులకు సత్వరం నోటీసు జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పలు దుకాణాలలో పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, దుకాణాల నిర్వహణ చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్వో గోపాలకృష్ణ వర్మ, ఆర్ఐ అమర్నాథ్ రెడ్డి, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో శ్వాసకోశ వ్యాధులను నివారిద్దాం..

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : చిన్న పిల్లల్లో శ్వాశకోశ వ్యాధులను నివారిద్దామని కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కృష్ణారావు పేర్కొన్నారు. కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో ఈ నెల 14, 15వ తేదీలలో చిన్నపిల్లలలో కలుగు శ్వాస కోశ వ్యాధి సంక్రమణపై అవగాహన నిర్వహించనున్నట్లు డీన్, ప్రిన్సిపాల్ డాక్టరు కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రానికి వివిధ ప్రాంతాల నుండి నిష్ణాతులైన వైద్యులు పాల్గొని, చిన్నపిల్లలలో తరచుగా వచ్చు శ్వాసకోశవ్యాధుల నివారణ కు పాటించాల్సిన వైద్య విధానాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తూ, అందుకు తగిన సలహాలు, సూచనలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

రైతు బాంధవుడు చంద్రన్న.. రైతు ద్రోహి జగన్

మాజీ ఎమ్మెల్సీ గౌనువారి శ్రీనివాసులు

ప్రజాశక్తి -శాంతిపురం : 'రైతు బాంధవుడు చంద్రన్న, రైతు ద్రోహి జగన్' అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు విమర్శించారు. శుక్రవారం వైసిపి కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఆయన విమర్శించారు. ఆంధ్ర దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణ అని పేరు. అలాంటి పచ్చని రాష్ట్రంలో ఐదేళ్లపాటు వైసిపి ప్రభుత్వం చేపట్టిన విధి విధానాల కారణంగా రైతులు సంక్షోభంలో కూరుకుపోయారన్నారు. రైతు భరోసా అంటూ ఏడాదికి 7,500 ఇచ్చి రైతులకు అందించాల్సిన అన్ని సబ్సిడీలను పథకాలను ఇవ్వకుండా పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతులను నట్టేట ముంచారన్నారు. జగన్ పాలనలో చేపట్టిన రైతు వ్యతిరేక విధానాల కారణంగా 3 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండవ స్థానంలో నిలిచిందన్నారు. జగన్ పాలనలో రైతుల రుణభారం పెరిగి గిట్టుబాటు ధరలు లేక, పంటలకు బీమాలు సక్రమంగా అందించకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో 2014 నుండి 19 వరకు రైతు రుణమాఫీ, పంట బీమా, ఇన్పుట్ సబ్సిడీతో పాటు మొత్తం రైతులకు ఉపయోగపడే 22 పథకాలను తీసుకొని వచ్చి రైతులకు 40 వేల కోట్ల రూపాయల లబ్ధిని చేకూర్చారన్నారు. విపత్తు సమ యంలో రైతులకు అందించాల్సిన సాయాన్ని సక్రమంగా నెరవేర్చలేదని జగన్‌పై మండిపడ్డారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రైతులను విస్మరించి నేడు రాజకీయ లబ్ధి కోసం తమ ఉనికిని చాటుకోవడానికి రైతుల పేరుతో నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.